క్లుప్తంగా

రెడ్‌క్రాస్ అవతరణ దినోత్సవం



హెన్రీ డునాంట్ చిత్రపటం వద్ద నివాళి

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారం ప్రజా గ్రంథాలయంలో సోమవారం రెడ్‌క్రాస్ అవతరణ దినోత్సవాన్ని ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రెడ్‌క్రాస్ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ మాట్లాడుతూ 1895లో హెన్రీ డునాంట్ రెడ్ క్రాస్ స్థాపించారని తెలిపారు. ఈ సంస్థ ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ఎంతో మంది ప్రాణాలు రక్షిస్తున్నారని చెప్పారు.

ఎంపీని కలిసిన ఎన్‌జీఓ ప్రతినిధులు



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎన్‌జీఓ నాయకులు

చీపురుపల్లి: ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను చీపురుపల్లిలోని ఆయన నివాసంలో ఎన్‌జీఓ బొబ్బిలి తాలూకా యూనిట్ నాయకులు సోమవారం కలిశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో సంఘ అధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి రామారావు తదితరులు ఉన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని ఎంపీడీఓ బీఎస్‌కేఎస్ పట్నాయక్ అన్నారు. వేపాడ గ్రామ సచివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఉద్యోగులు, వలంటీర్ల హాజరు రిజిస్టర్‌లు, మూమెంట్ రిజిస్టర్, స్పందన వినతుల ఆన్‌లైన్‌- పరిష్కారం, పౌరసేవలు, తదితర వాటిని తనిఖీ చేశారు. ఎస్‌డీజీ సర్వేలో 0-5 ఏళ్ల పిల్లల వివరాలు నమోదుపై ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, సచివాలయ సిబ్బంది, ఆర్‌బీకే వీఏఏ పవన్, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం



నిహారికను అభినందిస్తున్న పొట్నూరు సన్యాసినాయుడు, పాఠశాల సిబ్బంది

గుర్ల: పదో తరగతి పరీక్షలలో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన పాలవలస హైస్కూల్ విద్యార్థిని పొట్నూరు నిహారికను వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు సోమవారం సత్కరించారు. అలాగే పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన పెనుమజ్జి మణికంఠను పాఠశాల సిబ్బంది అభినందించారు. ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పెనుమజ్జి అప్పలనాయుడు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

గజపతినగరం: పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు కుమార్తె కర్రి ప్రణతిని స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

రేషన్ బియ్యం అమ్మినా, కొన్నా నేరమే..

కొత్తవలస: ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం అమ్మినా, కొనినా నేరమే అని సివిల్‌సప్లై డీటీ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సరఫరా చేస్తున్న బియ్యంలో విటమిన్ బి12, ఐరన్, ఫ్లోరిక్ ఆమ్లం వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయని, కిలో రూ.40 విలువైన బియ్యాన్ని రేషన్ లబ్ధిదారులకు కేవలం ఒక్క రూపాయికే అందిస్తోందన్నారు. ఈ బియ్యాన్ని ఎవరైనా వ్యాపారులకు అమ్మినా, లబ్ధిదారుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసినా నేరంగా పరిగణించి లబ్ధిదారుని రేషన్‌కార్డు రద్దు చేయడం జరుగుతుందన్నారు. బియ్యం కొనుగోలు, అమ్మకానికి సంబంధించిన సమాచారాన్ని 8639842627 నంబరుకు అందజేయాలని కోరారు.

సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

- రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ
- రూ.2కోట్లతో తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి రూరల్(గరివిడి): ప్రజా సంక్షేమ పాలన అందిస్తూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల ఆశీస్సులు, దీవెనలు ఉంచాలని విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గరివిడి మండలంలోని దువ్వాం నుంచి తోండ్రంగి గ్రామం వరకు రూ.2 కోట్లతో నిర్మించనున్న తారురోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. దువ్వాం గ్రామంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. పేద ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకోవడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానమని అన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్స్ ఏర్పాటుతో ప్రభుత్వ సేవలను గడపగడపకూ చేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎప్పుడైనా ఇలాంటివి చూశా మా అని ప్రశ్నించారు. ఓ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీ సిఫార్సు తప్పనిసరి అని, అందుకోసం వారికి ఎంతో కొంత చెల్లించాల్సి వచ్చేదన్నారు.

ఓర్వలేకే ప్రభుత్వంపై విమర్శలు..

గత ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎన్నికల హామీలను అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామనే అక్కసుతో టీడీపీ నాయకులు ఓర్వలేక ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో వారు అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి సంక్షేమ పథకాలు అందించలేకపోయారని, ఇప్పుడు మేము ఇస్తుంటే కడుపుమంటతో ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఇప్పుడు సమస్యలను నేరుగా సీఎం దృష్టికి తీసుకువెళ్లేలా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇనాం భూముల సమస్యను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురాగా.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ గోవింద్‌ను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా గరివిడిలో ఫుట్‌బాల్ గ్రౌండును ప్లే గ్రౌండుగా కేటాయించాలని యువత కోరగా.. ప్రైవేటు స్థలాల్లో గ్రౌండ్లు కావాలని కోరితే ఏమి చేయలేమని, ప్రభుత్వ స్థలం ఉంటే చూస్తామన్నారు.

నాలుగేళ్లలో దువ్వాంకు రూ.15 కోట్లు: జెడ్పీ చైర్మన్

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఈ నాలుగేళ్లలో దువ్వాం సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా రూ.15 కోట్లను లబ్ధిదారులకు అందించినట్లు చెప్పారు. దువ్వాంలో అన్ని సౌకర్యాలతో జగనన్న లేఅవుట్‌ను అభివృద్ధి చేశామన్నారు. గతంలో దువ్వాం ఇనాం గ్రామంగా ఉండేదని, ప్రజల ఇబ్బందులను గుర్తించి అప్పట్లో మంత్రిగా ఉన్న సమయంలో సర్వే చేయించి ఇనాం భూముల సమస్యను పరిష్కరించామన్నారు. కొన్ని సాంకేతిక సమస్యలతో కొంతమంది భూములు ఇంకా ఇనాం జాబితాలో ఉండిపోయాయని, వాటిని సర్వే చేయించి రైతులకు పట్టాలు మంజూరు చేస్తామన్నారు.

మరోసారి గెలిపించుకుందాం: ఎంపీ బెల్లానం

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో అమలు చేసి చూపించారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పాలనను ప్రజల వద్దకే తీసుకువచ్చిన ఇలాంటి ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ తోట స్వాతి, ఎంపీటీసీ నేతేటి కృష్ణవేణి, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీలు జి.వెంకటఅప్పలరాజు, గుడివాడ శ్రీరాములనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలకల అప్పలనాయుడు, లెంక శ్రీరాములు, తోట రవి, పొన్నాడ కుమార్, పిల్ల అప్పలనాయుడు, రఘుమండ శ్రీదేవి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అభివృద్ధి బాగుంది

- మంత్రి ఆర్.కె.రోజా



మంత్రి రోజాకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి

దత్తిరాజేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చాలా బాగుందని రాష్ట్రమంత్రి ఆర్‌కే రోజా అన్నారు. జిల్లాలో పర్యటిస్తున్న ఆమె సోమవారం షికారుగంజిలోని తన స్నేహితుడు నేరేడుబిల్లి తిరుపతిరావు ఇంటికి వెళ్లి కాసేపు కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. గ్రామానికి విచ్చేసిన మంత్రి రోజాకు జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, స్థానిక నాయకులు సామురోతు వెంకటరావు, ధన్నాన త్రినాథరావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో ఏ గ్రామంలో చూసినా రోడ్లు, కాలువలు, మౌలిక వసతులు ఉన్నాయని, అలాగే రోడ్డు ప్రమాదాలకు తావులేకుండా జాతీయ రహదారి విస్తరణ చేపట్టడం బాగుందన్నారు. స్థానికంగా ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే వాటిని మీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాల్లో పిల్లలను చేర్పించండి



పోతుబందిపాలెంలో ఒకటో తరగతిలో చేరే పిల్లలు వివరాలు సేకరిస్తున్న ఉపాధ్యాయులు

వేపాడ: దబ్బిరాజుపేట ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు పలు గ్రామాల్లో సోమవారం ప్రచారం చేపట్టారు. దబ్బిరాజుపేట, పోతుబందిపాలెం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఒకటో తరగతిలో చేరే పిల్లల వివరాలు సేకరించారు. ప్రభుత్వ పాఠశాల్లో చేరే విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, షూ, స్కూల్‌బ్యాగులతో పాటు అమ్మఒడి పథకం కింద ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. నాడు-నేడు కార్యక్రమ ద్వారా పాఠశాలల్లో అవసరమైన అన్ని వసతులు కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వం కల్పించే రాయితీలు, వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య సేవలందిస్తున్న వైద్యులు

శృంగవరపుకోట: మండంలోని రేవళ్లపాలెం గ్రామంలోని పొట్టి శ్రీరాములు గ్రంథాలయం ప్రాంగణంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సామాజిక కార్యకర్త అబ్దుల్ రవూఫ్ పుట్టినరోజు సందర్భంగా విజయనగరానికి చెందిన తిరుమల, మెడికవర్ ఆస్పత్రుల సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు రోగులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. దీర్ఘకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి ఎక్స్‌రే, స్కానింగ్, ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా చేశారు. పలువురు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, అబ్దుల్ రవూఫ్, గ్రంథాలయ నిర్వాహక సభ్యులు, గ్రామ యువకులు శిబిరంలో సేవలందించారు.

విద్యుత్ మోటారు ఏర్పాటు

వేపాడ: నల్లబిల్లి గ్రామంలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు నీటి సమస్య ఉందని లబ్ధిదారులు హౌసింగ్ డే కార్యక్రమంలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు సోమవారం కాలనీలో విద్యుత్ మోటార్‌ను ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కేఆర్‌వీ పైడిరాజు పనులను పర్యవేక్షించారు. నీటి వసతి కల్పించినందున నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని లబ్ధిదారులను కోరారు.

భవిష్యత్ ఫార్మా రంగానిదే..

విజయనగరం అర్బన్: ఫార్మా రంగంలో నైపుణ్యం ఉన్న వారికి మంచి జీతంతో కోరిన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ అన్నారు. నగరంలోని టీడీడీసీని సోమవారం సందర్శించి ఫార్మారంగంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందుతున్న యువతతో ఆయన ముచ్చటించారు. రెడాక్స్ లేబొరేటరీ సంస్థ యువతకు శిక్షణ ఇచ్చి మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా అధికారి గోవిందరావు, జాబ్స్ మేనేజర్ మార్టిన్, రెడాక్స్ డీపీ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడితల్లి పండుగ



లక్కవరపుకోట: తొలేళ్ల సంబరంలో భారీ ప్రభను ప్రదర్శిస్తున్న భక్తులు

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగ మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 54 సంవత్సరాల తర్వాత గ్రామదేవత ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో గ్రామం కళకళలాడుతోంది. తొలేళ్ల ఉత్సవంతో పండగ ప్రారంభమైంది. ఈ సందర్భంగా భారీ ఎత్తులో ప్రభలు కట్టి ప్రదర్శించారు. పండగకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

బొడ్డవరలో బంగారమ్మ పండుగ

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవరలో గ్రామదేవత బంగారమ్మ తల్లి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. భక్తులు అమ్మవారికి పూజలు చేసి చీర, సారెలు చూపించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వాలీబాల్ పోటీలను నిర్వహించారు.

వేసవిలో విజ్ఞానం



లక్కవరపుకోట: శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు



ఎస్.కోట: గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరానికి హాజరైన విద్యార్థులు



గంట్యాడ: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ అధికారి రామభద్రరాజు, తదితరులు



చీపురుపల్లి: వేసవి విజ్ఞాన శిబిరంలో మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి బుచ్చింనాయుడు, ఉపాధ్యాయులు



వేపాడ: విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న వేపాడ హైస్కూల్ హెచ్‌ఎం వల్లీ, లైబ్రేరియన్ సోమునాయుడు

వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా అన్ని శాఖా గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పౌర గ్రంథాలయశాఖ, జిల్లా గ్రంథాలయ సంస్థ సౌజన్యంతో చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గంలోని అన్ని శాఖా గ్రంథాలయాల్లో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభమయ్యాయి. సెలవుల్లో విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోయి సమయాన్ని వృథా చేసుకోకుండా విజ్ఞానాన్ని పెంచుకునేలా వీటిని నిర్వహిస్తున్నారు. జూన్ 11వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయి. ఆటపాటలతో పాటు పుస్తక పఠనం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్స్, స్టోరీ టెల్లింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. విజ్ఞానంతో పాటు సృజనాత్మకను మెరుగుపర్చుకునేలా కార్యక్రమాలను రూపొందించారు. – సాక్షి నెట్‌వర్క్

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బొండపల్లి: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని ఒంపల్లి, బిల్లలవలస గ్రామంలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయంతో పాటు స్థానిక సమస్యలు తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి గాను ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు కేటాయించడంతో పాటు ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బి.వి.ప్రభాజీ, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, మాజీ ఎంపీపీ బండారు బంగారం, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఎ.వేదవతి, పార్టీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, ఒంపల్లి, బిల్లలవలస గ్రామ సర్పంచ్‌లు లండా నారాయణమ్మ, నెట్టి ఏసురత్నం, నాయకులు నెట్టి ముకుంద, నెట్టి ఆనంద్, కర్రోతు శ్రీనివాసరావు, బొద్దల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు నెలివాడలో..

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు హాజరవుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

రాయితీపై రుణాలు

- ఏపీఫుడ్ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి



బేకరీ తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి

చీపురుపల్లి: పేద, మధ్యతరగతి వర్గాల ఆర్థిక అభ్యున్నతి కోసం వివిధ యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 35 శాతం రాయితీపై అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఫుడ్ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సీహెచ్ చిరంజీవిచౌదరి అన్నారు. పీఎఫ్‌ఎమ్‌ఎఫ్‌పీఈ పథకంలో భాగంగా చీపురుపల్లి పట్టణంలో రూ.10 లక్షల రుణంతో ఏర్పాటుచేసిన బేకరీను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో రుణం పొందిన వారికి 35 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ప్రతినెలా బ్యాంకు వాయిదాలు సకాలంలో చెల్లిస్తూ పరపతి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఓ జమదగ్ని, మార్కెటింగ్ ఏడీ శ్యామ్‌కుమార్, హెచ్‌ఓ చంద్రశేఖర్, తహసీల్దార్ ఎం.సురేష్, ఏపీఎమ్‌లు ఎం.వి.రాజశేఖర్, ఆర్.అనూరాధ, ఎ.పద్మావతి, కె.అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం చేయాలి



డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణను కలిసిన ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

గజపతినగరం: గజపతినగరం- పోరలి గ్రామాల మధ్య చేపట్టిన రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గజపతినగరం నుంచి పోరలి వరకు రహదారి మంజూరై నాలుగేళ్లయినా పనులు పూర్తికాకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే సుమారు 10 గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు పనులు వేగవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు డీవైఎఫ్‌ఐ మండల కమిటీ సభ్యుడు రామచంద్ర, తదితరులు ఉన్నారు.

పదిలో సత్తా చాటిన విద్యార్థులకు అభినందన



గంట్యాడ: పెదవేమలి హైస్కూల్లో విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

గంట్యాడ: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల నుంచి 95 మంది పరీక్షలకు హాజరుకాగా మొత్తం అందరూ ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ రామకృష్ణారావు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు. అలాగే పెదవేమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన బండారు సత్యనితీస్(553), బండారు బంగారులక్ష్మి(528), పాటుపురెడ్డి పృధ్వి(506)ను పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాటుపురెడ్డి భవానీ, సర్పంచ్ వర్రి పాపునాయుడు, పాఠశాల చైర్మన్ డోకుల సత్యనారాయణ, హెచ్.ఎం ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వినియోగించుకోండి



దత్తిరాజేరు: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సతీష్

దత్తిరాజేరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంటి వద్దనే వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఫ్యామిలీ డాక్టర్' సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దత్తిరాజేరు వైద్యాధికారి సతీష్ కోరారు. చినకాద గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సుమారు 56 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఆరోగ్య సిబ్బంది కృషిచేయాలని సూచించారు.

తాండ్రంగిలో..

జామి: మండలంలో తాండ్రంగి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జామి పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖ సుమారు 112 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ పర్యటించి వైద్యసేవలు, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సత్యప్రసాద్, ఎంఎల్ హెచ్‌సీ వెంకటలక్ష్మి, వైద్య సిబ్బంది గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: పోలీస్‌నని చెప్పి ఓ వ్యక్తిపై దౌర్జన్యం చేసి బైక్ లాక్కొని పరారైన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక లీలామహల్ థియేటర్ వద్ద మార్చి 29న పితాని సాయికిరణ్ అనే వ్యక్తి వద్దకు భీమిలికి చెందిన కొయ్యి సూరిబాబు (ఆర్మీలో పనిచేసి మానేశాడు) వచ్చి తాను పోలీస్‌నని బెదిరించి యమహా బైక్ తీసుకుని పరారయ్యాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిఘా పెట్టి స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని బంగారమ్మ కాలనీకి చెందిన కిడ్నీవ్యాధి బాధితుడు బలివాడ మహేష్‌కు శిష్టకరణం లిఫ్టింగ్ హ్యాండ్స్ సొసైటీ, మాతృభూమి సేవా సంఘం సంయుక్తంగా రూ.31,500 ఆర్థిక సాయం అందజేశారు. మహేష్ కుటుంబం పడుతున్న కష్టాలను తెలుసుకున్న దాతలు ఆర్థిక సాయంతో పాటు నెలకు సరిపడే నిత్యావసర సరుకులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. మహేష్‌కు సొంత ఇళ్లు కూడా లేదని, ఇద్దరు ఆడపిల్లలతో కుటుంబాన్ని పోషించుకోలేక ఆర్థికంగా అవస్థలు పడుతున్నట్లు తెలుసుకుని తమకు తోచిన సాయం చేశామన్నారు. దాతలు ముందుకువచ్చి మహేష్ కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో టి.ప్రసాద్ పట్నాయక్, పి.శంకరరావు, వాండ్రంగి వెంకటేష్, బి.జోగారావు, డి.రామచంద్రరావు, ఐ.గోపాలరావు, బి.పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.